
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు

## అమెరికులాసా కథ – 198
## అమెరికాసుపత్రి కథ

అది అక్టోబర్, 2024 నెలాఖరున ఒక రోజు. అమెరికాలోనే కాక యావత్ ప్రపంచం లోనే ఎంతో మంచి పేరున్న ఒకానొక ప్రముఖ ఆసుపత్రిలో ఐదో అంతస్తులో మారుమూల పెద్ద గది. అది హ్యూస్టన్ లో మా ఇంటికి కారులో పది నిమిషాల దూరం. ఆ గది కిటికీ పక్కన సోఫాలో మా పెద్దమ్మాయి, రెండో అమ్మాయి, సుపుత్రుడూ వాళ్ళ లాప్ టాపులలో ఆఫీసు పనులు చూసుకుంటూ టక టకా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. తన సెల్ ఫోన్ లో లలితా సహస్ర నామం చదువుకుంటూ అప్పుడప్పుడు ఆ గది మధ్యలో ఆసుపత్రి మంచం మీద నా లాప్ టాపు లో నవంబర్ నెలాఖరున ఖతార్ దేశ రాజధాని దోహాలో జరగబోయే 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు పనులు చూసుకుంటున్న నన్ను చూసుకుంటూ మా అర్ధాంగి 'అమెరికాలక్షేపం' చేస్తోంది. అంతా నిశ్శబ్దం.

సరిగ్గా అంతకు నాలుగైదు రోజుల ముందు ఇంట్లో హాయిగా కూచుని ట్రంపూ –కమలా ఒకరినొకరు తిట్టుకుంటున్న తతంగం చూస్తూ ఆనందిస్తున్న నాకు కడుపులో చిన్న నొప్పి లాంటిది వచ్చింది. "ఓస్ అంతేనా. మాంచి శొంఠి పొడి వేడి నీళ్ళలో కలుపుకుని తాగేస్తే పోతుంది" అని మా క్వీన్ విక్టోరియా శొంఠి పొడి కోసం వెతకడం, అది ఆ రకం నొప్పి కాదేమో అని నాకు అనుమానం రావడం, ఆవిడ సంతృప్తి కోసం ఓ గ్లాసుడు శొంఠి రసం గుటకలు వేసేసి, వెంటనే పైన ఉదహరించిన ప్రపంచ ప్రఖ్యాత ఆసుపత్రి ఎమర్జెన్సీకి వెళ్ళడం జరిగిపోయాయి. మా అమెరికాసుపత్రి పేరు మెథడిస్ట్ హాస్పిటల్.

ఇక ఎమర్జెన్సీ అంటే మామూలుగా అయితే మా క్వీన్ విక్టోరియా ఎందుకైనా మంచిది అని 911 నీ, తర్వాత నాలుగైదు ప్రవేటు ఏంబ్యులెన్సుల వాళ్ళకీ ఫోన్ చెయ్యడానికి రెడీగా ఉంటుంది. కానీ ఈ సారి నా ఈ కడుపు నొప్పి మరీ ఎక్కువగా లేదు కాబట్టి, ఓ రెండు చెడ్డీలూ, ఇతర సామగ్రీ ఓ చిన్న సంచీలో సద్దేసుకుని నేనే డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరం ఆసుపత్రికి వెళ్ళిపోయాం. మా క్వీన్ విక్టోరియా డ్రైవ్ చెయ్య గలదు కానీ ఓ పక్క సెల్ ఫోన్ లో లలితా సహస్ర నామం చదువుకుంటూ, ఏ రోడ్డు మీద ఎటు పక్కకి తిరగాలో నన్ను డైరెక్షన్స్ అడుగుతూ చీకట్లో డ్రైవింగ్ చేస్తూ తను

అష్టావధానం చేస్తే దారిలో ప్రయాణీకులకి ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. అది మరొక ఎమర్జెన్సీ కదా!. తీరా మా మెథడిస్ట్ ఆసుపత్రి ఎమర్జెన్సీకి వెళ్ళి, నా పేరు చెప్పగానే, వాళ్ళ కంప్యూటర్ లో నా సమాచారం,..అంటే మా తాత గారూ, బామ్మ గార్ల ప్రవర, వందేళ్ళ క్రితం వాళ్ళ పెళ్ళి రోజు, వాళ్ళు వెళ్ళి పోయిన రోజులూ వగైరాలతో నా జాతకం అంతా తంగున బయట పడింది. చెప్పొద్దూ..అవి చూసీ చూడగానే అక్కడ కూచున్న అందమైన అమ్మాయి "మెథడిస్ట్ కి మళ్ళీ స్వాగతం" అని నవ్వగానే నాకు ఒళ్ళు మండిపోయింది. కాదు మరీ. ఒక పక్కన కడుపు మంటతో ఆసుపత్రికి వెళ్తే ఈ పూర్ణ కుంభం తో స్వాగతం చెప్పడం ఏనిటీ? ఇదేమన్నా శాలువా కప్పించుకుని సన్మానం చేయించుకోడానికి వచ్చానా? పోనీ అలా అని, నేనేమీ ఎమర్జెన్సీకి వారానికో సారి వెళ్ళే ఫ్రీక్వెంట్ ఫ్లయర్ ని కాదు కదా!. అన్నట్టు అమెరికాలో డ్రగ్స్ కి అలవాటు పడిన వాళ్ళలో డోస్ ఎక్కువ వేసేసుకుని వారం, వారం ఎమర్జెన్సీకి వెళ్ళేవాళ్ళని ఫ్రీక్వెంట్ ఫ్లయర్ అంటారు.

ఇక నా వివరాలు జమ చేసుకుని, సరి కొత్త సమాచారం కంప్యూటర్ లో ఎక్కించేయగానే, ఒకానొక భారీ ఆఫ్రికన్ అమెరికన్ మెడికల్ వీరుడు నన్ను పలకరించి చక్రాల కుర్చీలో కూచోబెట్టి, ఓ చిన్న గదిలోకి తీసుకెళ్ళి నా మద్రాస్ బ్లీచ్ చొక్కా బొత్తాలు విప్పేసి, ఛాతీ నిండా వైర్లు పెట్టేసి, EKG తీసేసి, "బాగానే ఉన్నావే, హార్ట్ ఎటాక్ కాదనమాట " అని పొగిడాడు. నేను అక్కడికి వెళ్ళింది కడుపు నొప్పి కి కదా...మరి అక్కడ ఫొటో తియ్యాలి కానీ పైన ఎక్కడో అమాయకంగా కొట్టుకుంటున్న గుండె కాయ గ్రాఫ్ ఎందుకు తీశాడో వాడికే తెలియాలి మరి. ఈ లోగా మరొక ఐదు అడుగుల వియత్నాం అమ్మాయి గదిలో ప్రవేశించి "నీకు ఐవీ పెట్టాలి" అని కిచ కిచ లాడింది. ఆ సమయం లో నాకు బాగా తెలిసినదీ, ఆ పిల్లకి ఈ మాత్రం తెలియని చిదంబర రహస్యం ఒకటి నాకు గుర్తుకి వచ్చి "ఆల్ ద బెస్ట్" అన్నాను. ఈ చిదంబర రహస్యం ఏమిటంటే...ఈ దిక్కుమాలిన IVY పెట్టడానికి కావలసిన రక్తనాళాలు నా విషయంలో అతి చిన్నవి అని గత అనుభవంలో నాకు మాత్రమే తెలుసు. పైగా ఈ అతి చిన్న రక్త నాళాలు కూడా చర్మానికి లోలోపల ఎక్కడో అడుగున దాక్కుని ఉంటాయి. వాటిని కనిపెట్టి, సూది గుచ్చి, ఐవీ పెట్టడం ఈ ఐదడుగుల వియత్నాం పిల్ల వల్ల కాదు అని నాకు డౌటనుమానం వచ్చేసింది. దానికి ఒకే ఒక మంత్రం "అల్ట్రాసౌండ్" అనే యంత్రం అని కూడా నాకు తెలుసు. అనగా...కంటికి కనపడని నా అతి చిన్న రక్త నాళాలు "vein finder" అనే దుర్భిణీ యంత్రంలో కుళాయి గొట్టాలలాగా కనపడతాయి. పైగా నా విషయం లో అయితే ఒక చేతి మీద ఒక ఐవీ తో పని జరగదు. ఒక్కొక్క చేతికి ఒక్కొక్కటి చొప్పున కనీసం రెండు ఉండాలి. ఒక దాంట్లోంచి అవసరమైన మందులు, మరొక దాంట్లోంచి పౌష్టికాహారం వగైరాలు డాక్టర్లు అలా మన శరీరం లోకి ఎక్కిస్తూ ఉంటారు. ఈ సంగతులు అన్నీ నాకంటే ఆ పొట్టమ్మాయికి వివరంగానే చెప్పాను మరి.

నిజానికి ఇలా ఐవీల లోంచి అన్నీ ఎక్కించేది ఎవరైనా కానీ ఏ ద్రవ పదార్థం ఎప్పుడు ఎక్కించాలో చెప్పేది ఎవరో మనకి చస్తే తెలియదు. అనగా మన ఆసుపత్రి గదిలో మనం బెడ్ మీద పడుకుని ఉండగా ఈ ఐవీ ల ఆట ఆడుకునే నర్సులు, నర్స్ ప్రాక్టీషనర్లు, ఫిజీషియన్ అసిస్టెంట్లు, ఇలా రాక రకాల పేర్లతో ఉన్న వాళ్ళు ఉంటారు కానీ అసలు సిసలు డాక్టర్లు, సర్జన్లు ఎక్కడో దాక్కుని ఉంటారు. మహా అయితే రోజూ పొద్దున్న మనం ఇంకా గాఢ నిద్రలో ఉన్నప్పుడు ఐదు నిమిషాలు పలకరించి పారిపోతారు. అలా అని సరి అయిన ట్రీట్ మెంట్ జరగడం లేదేమో అని ఏ మాత్రం అనుమానం అక్కర లేదు. దేని దారి దానిదే!. మనం అమెరికాసుపత్రిలో చేరగానే అప్పటికప్పుడు మొత్తం టీమ్ ఏర్పాటు అయిపోతుంది. అందులో మన పరిస్థితిని బట్టి ఇంటర్నల్ మెడిసిన్, సర్జన్, కిడ్నీ, కార్డియాలజిస్ట్, గాస్ట్రిక్ డాక్టర్, మెదడు డాక్టర్,..ఇలా ఒకరేమిటి....అన్నీ రకాల స్పెషలిస్ట్ లూ అందుబాటులో ఉంటారు కానీ మనకి తెలీదు. అదీ అమెరికా అంటే.

అన్నట్టు, ఎందుకైనా మంచిది అని కాబోలు....మొదటి రోజు "నీ గురించి ప్రార్థన చెయ్యమంటావా?" అని జాలిగా మొహం పెట్టి అడుగుతూ ఒక ప్రీస్ట్ గారో, ఏ మతం వాడో తెలియకుండా ఉండే గెటప్ లో ఉండే మరొకాయనో వచ్చి పరామర్శిస్తాడు. ఇది భలే ఇబ్బంది కదా!. "ఓకే, సార్ నా తరఫున ప్రార్థన చెయ్యండి" అని చెప్పాం అనుకోండి. ఆ మాట మా క్వీన్ విక్టోరియా వినేసిందే అనుకోండి. "మరి నా లలితా సహస్రనామాల సంగతి ఏమిటీ? అది మానెయ్యమంటావా?" అని నా వీపు చీరెయ్యదూ? సాధారణంగా ఇలా మన గురించి ప్రార్థన చెయ్యడానికి కుతూహల పడేవాళ్ళు అమెరికాలో కూడా మన కేరళా వారే. ఇక ఓపిక ఉన్నవాళ్లు ఎవరి ప్రార్థన వాళ్ళే చేసుకోడానికి అమెరికాసుపత్రిలో ఒక గది కూడా ఉంటుంది. కానీ అక్కడికి మనం వినాయకుడి బొమ్మనో, ఆంజనేయ స్వామి విగ్రహమో తీసుకెళ్ళ వచ్చునో లేదో నాకు తెలీదు!

మరొక ముఖ్యమైన విషయం....ఆసుపత్రిలో అడుగుపెట్టగానే మొదటి అరగంటలో మన ఇన్సూరెన్స్ సమాచారం అంతా సేకరించి, మనం ఏదైనా ముందస్తుగా కట్ట వలసిన సొమ్ము అత్యంత మర్యాదగా వసూలు చేస్తారు. అంతే...ఆ తర్వాత అస్సలు ఎవరు, ఎప్పుడూ, ఎన్నాళ్ళు ఆసుపత్రిలో ఉన్నా, డబ్బు గురించి మాట్లాడనే మాట్లాడరు. అదే భారత దేశంలో అయితేనో? ఏమో నాకు తెలీదు. అలా అని అమెరికాలో అంతా సవ్యంగానే ఉంటుంది అనుకుంటే పప్పులో కాలు వేసినట్టే. మన వయసుని బట్టి, ఇన్స్యూరెన్స్ అమ్మాయి ఆ రోజు ఏ మూడ్ లో ఉందో దాన్ని బట్టి, మెడికేర్, మెడికైడ్ కవరేజ్ లు ఏమైనా ఉన్నాయో, లేదో దాన్ని బట్టి మనం ఆరోగ్యం కుదురుకుని ఇంటికి వెళ్ళిపోయాక వచ్చే బిల్లు చూడగానే మళ్ళీ గుండె పోటు వచ్చి అదే ఎమర్జెన్సీకి వెళ్ళ వలసి రావచ్చును. ఏమో?

నేను గమనించిన మరొక చిన్న విషయం ఏమిటంటే...మనం అమెరికాసుపత్రి లోపలికి వెళ్ళగానే అంతా ఏదో సినిమాలలో చూపించినట్టు అంతా సీరియస్ గా ఉంటుంది అనుకుంటాం కానీ....దాం దుంప తెగా...అందరూ చిరునవ్వు తోటి "ఎలా ఉన్నావు?" అంటూ పలకరించగానే మనం నొప్పులూ, గిప్పులూ మర్చిపోయి పొరపాటున ఇక్కడికి

వచ్చేశామేమో అని అనుమానం వస్తుంది. కానీ పైన చెప్పినట్టుగా ఈజీ ఈకేజీ, చిన్న సూది లేదా ఇండియాలో ధాన్య సంచీ కుట్టే దబ్బనం సైజు సూది తో కానీ ఒకటో, రెండు ఐవీ లు ఏర్పాటు వాళ్ళు మొదలుపెట్టగానే మన కండిషన్ గుర్తుకి వచ్చేస్తుంది. ఈ లోగానే ఎక్కడో వెనకాల గదిలో కూచున్న టీమ్ లీడర్ డాక్టర్ మన పరిస్థితిని బట్టి ఎక్స్ రేలు, గుండె, కోలన్, మెడ, తల కాయ..ఇలా ఎక్కడ అనుమానం ఉంటే అక్కడ సి.టి స్కాన్ చెయ్యమని కంప్యూటర్ లో మనకి తప్ప మిగతా వాళ్లందరికీ ఆర్డర్లు వేస్తాడు. ఈ ఆర్డర్ సంగతి ఆ స్కాన్ చేసే గది లోకి మనల్ని రెండు చక్రాల కుర్చీలోనో, నాలుగు చక్రాల మంచం లోనో తోసుకెళ్లే వాళ్ళు వచ్చే దాకా మన కి తెలీదు. ఈ సీటీ స్కాన్ అంటే అదేదో తమన్నాతోటో, సమంతాతోటో  సెల్ఫీ తీసేసుకోవడం కానే కాదు. మనల్ని అడ్డంగా మడత మంచం మీద పడుకోబెట్టి, మెల్లిగా ఓ ఖరీదైన గొట్టం లోకి తోసేసి, పెద్ద అయస్కాంతాలు, మేగ్నెట్లు గిర గిరా తిప్పేసి ఫొటోలు తీసే తతంగం అన మాట. ఈ రోజుల్లో అమెరికా పద్ధతి ప్రకారం ఈ సీటీ స్కాన్ లో వాళ్ళు తీసిన ఫొటోలు కంప్యూటర్ లో అప్పటికప్పుడు ఎక్కించేసి మనకి "నీ తాజా ఫొటోలు చూసే లింక్" అని ఫోన్ లో సమాచారం వస్తుంది. వీటి కోసం చచ్చేటంత డబ్బు కట్టాను కదా అని నేను సరదా పడి ఆ దిక్కుమాలిన ఫొటోలు చూద్దును కదా నన్ను చూసి నేనే గుర్తు పట్టలేక పోయాను.  ఆ నలుపూ తెలుపూ ఫొటోలలో ఎక్కడా నా మొహం కానీ, గుండె ఆకారం కానీ అస్సలు ఏమీ కనపడక, అంతా గజిబిజిగా ఉండి కాస్త కంగారు పడి,  "ఏమోయ్ డాక్టరూ...నా కీలకమైన అవయవాలు పూర్తిగా మిస్సింగ్ గా ఉన్నాయి. పెద్ద ప్రేవులు, చిన్న ప్రేవులు, కిడ్నీ ఎక్కడా కనపడడం లేదు. అసలు నీకు ఫొటోలు తియ్యడం వచ్చునా? అని ఆ రేడియాలజిస్ట్ కి ఫోన్ చేసి కంగారు పెట్టేశాను. ఆ డాక్టరమ్మాయి నవ్వేసి "ముందే చెప్పానుగా" అని ఆ ఎక్స్ రే ఫొటో లో ఉన్న లొసుగులు వివరంగా చెప్పింది. అప్పటి నుంచీ నేను మా ఇంట్లో నిలువుటద్దం లోనూ, సెల్ ఫోన్ సెల్ఫీలలోనో తప్ప నా ఫొటోలు ..మరీ ముఖ్యంగా అమెరికాసుపత్రి వాళ్ళు తీసిన లోపలి అవయవాల ఫొటోలు చస్తే చూడదల్చుకో లేదు.

మొత్తానికి ఈ సారి  Ngyen ..ఎన్ గుయెన్ అని ఆంగ్లంలో రాసినా, పలకడం మటుకు విన్ అనే ఒకానొక చైనా సర్జన్ గారు రోబాట్ సహాయంతో నా పొట్టలో అంతా సవ్యంగా సరిదిద్దాడు. కానీ సరిగ్గా ఇదే సమయంలో..అంటే నవంబర్ 22-23, 2024 తేదీలలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకి వెళ్ళడానికి మా డాక్టర్లు,  అదే ఆసుపత్రిలో నర్స్ ప్రాక్టీషనర్ గా పని చేస్తూ, అందరు డాక్టర్లు, సర్జన్లు, స్టాఫ్ అందరూ బాగా తెలిసి, నన్ను దగ్గరుండి జాగ్రత్తగా చూసుకునే మా పెద్దమ్మాయీ నేను దోహా వెళ్ళడానికి ఏ మాత్రం ఒప్పుకో లేదు. అంచేత ఆ ప్రయాణం కేన్సిల్ చేసుకుని ఆ కార్యక్రమం అంతా యూ ట్యూబ్ లో చూశాను. ఆ విశేషాలు ..

మరొక సారి...అన్నట్టు మొన్నే మా సర్జన్ ఎన్ గుయెన్ అనే విన్ నుంచి చిన్న వాట్సప్ మెసేజ్ వచ్చింది. "మొన్న నీ కోలన్ కోసినప్పుడు నేను ఇంతకు ముందు ఎన్నడూ చూడని ఒకానొక సరి కొత్త పౌడర్ లాంటి పదార్థం కనపడింది. అదేమిటో నీకు తెలుసా?". ఇటీవల అమెరికాలో ఎక్కడ చూసినా పసుపు టాబ్లెట్లు, చ్యవన ప్రాశ, అశ్వగంధ మాత్రలు,

తైల మర్దనాల వివరాలు అన్నీ టీవీలలో కనపడుతున్నాయి కాబట్టి మా క్వీన్ విక్టోరియా శౌంఠి పొడి రహస్యం ఈ గుయెన్ గారికి చెప్పాలా వద్దా అనేదే ఇప్పుడు నా మిలియన్ డాలర్ల ప్రశ్న.

**COMMENTS**